క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: స్థానిక శివరాం రోడ్‌లో శ్రీలలితాదేవి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఆపార్టీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు గురువారం ఆలయ ప్రధాన అర్చకులు శంకరశర్మ నేతృత్వంలో శంకుస్థాపన చేశారు. ఇక్కడ పురాతన సంతోషిమాత, స్ఫటికలింగ సహిత లలితాదేవి ఆలయం ఉండేది. ఆస్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించనున్నారు.నిమ్మలవలస ఎంపీటీసీ అధికార్ల శ్రీనుబాబు, బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, ఎల్.ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

6న దత్తసాయి మందిరంలో శ్రీరామనవమి ఉత్సవాలు

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో గల శ్రీదత్తసాయి మందిరంలో ఈనెల 6న శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6న ఉదయం నిత్యపూజా కార్యక్రమాలతో పాటు 7.30 గంటలకు సీతారామ కల్యాణం జరిపించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అఖండ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం 3.15 గంటలకు ముస్లింలతో సాంప్ర దాయం ప్రకారం చందనోత్సవం, ఉరుసు ఉత్సవంతో పాటు షిర్డీసాయి పల్లకీ ఊరేగింపు ఉంటుందని స్పష్టం చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

11న అయ్యప్ప జన్మదిన వేడుకలు

చీపురుపల్లి: స్థానిక శివరాం రోడ్‌లోని తత్వమశి ధర్మశాస్త్ర మణికంఠ నిలయంలో అయ్యప్ప స్వామి జన్మదిన (ఆరాట్టు) వేడుకలను ఈనెల 11న ఘనంగా నిర్వహించనున్నట్లు గురుస్వామి యు.రమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 8గంటలకు స్వామి వారి ఆరాట్టు, చక్రస్నానం, 10గంటలకు అభిషేకాలు, 11గంటలకు స్వామి వారి పల్లకీ ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీ విజయవంతం



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

గజపతినగరం: స్థానిక బీఎస్సార్ ఆస్పత్రిలో బొండపల్లికి చెందిన ఆకేటి అప్పలనరసమ్మ (57)కు ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) ద్వారా గురువారం నిర్వ హించిన హిప్ రీప్లేస్‌మెంట్(తుంటి ఎముక మార్పిడి) శస్త్ర చికిత్స విజయవంతమైందని ఆ ఆస్పత్రి డైరెక్టర్ లక్ష్మీనరేంద్ర తెలిపారు. ఆర్థోపెడిక్ సర్జన్‌లు బి.సతీష్ కుమార్, జి.సుధాకర్,రాజేంద్రప్రసాద్, అనస్థీషియన్ ప్రవర్దన్‌లతో కూడిన బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు.

కిడ్స్ కాన్వొకేషన్



కాన్వొకేషన్‌లో సర్టిఫికెట్‌లతో విద్యార్థులు

శృంగవరపుకోట: పట్టణంలోని నారాయణ్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో గురు వారం కిడ్స్ కాన్వొకేషన్ నిర్వహించారు. విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు.

బెట్టింగ్ యాప్‌ల జోలికిపోవద్దు

కొత్తవలస: బెట్టింగ్ యాప్‌ల్లో పందాలు కాసి జీవితాలను నాశనం చేసుకోవద్దని స్థానిక సీఐ షణ్ముఖరావు సూచించారు. దేశపాత్రునిపాలెం సమీపంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, వారికి, పాఠశాలకు మంచి పేరుతెచ్చేలా బాగా చదువుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా బెట్టింగ్ యాప్‌ల జోలికి పోకుండా చదువుపై శ్రద్ధ చూపాలన్నారు.మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంటుందని, కష్టపడి చదువుకున్న వారికే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఊరి సంప్రదాయానికి 'ఉరి'

- పెణసాంలో శ్రీరామనవమి వేడుకలపై సందిగ్ధత
- పూర్వం నుంచి సీతారాముల కల్యాణం చేసే వారిని కాదని, తాము చేస్తామంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన కూటమి నాయకులు
- గత కొద్ది రోజులుగా ఎటూ తేలని పంచాయితీ
- శ్రీరామనవమి వేడుకులకు రెండు రోజులే గడువు



పెణసాం రామాలయం

గంట్యాడ: సంప్రదాయాలకు కూటమి నేతలు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారం ఉంది కదా అని పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయాలను పక్కన పెట్టి తాము చెప్పినట్టు చేయాలని హుకుం జారీ చేస్తున్నారు. దీంతో కూటమి నేతల తీరుపై గ్రామస్తులు విస్తుపోతున్నారు. కొంతమంది అధికారులు సైతం కూటమి నేతల ఆగడాలకు వంతపాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆ గ్రామంలో శ్రీరామనవమి వేడుకల నిర్వాహణపై నీలినీడలు కమ్ముకు న్నాయి. దేవుళ్లతో కూడా కూటమి నేతలు రాజకీయాలు చేస్తుండడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ఏటా ఘనంగా నిర్వ హిస్తూ ఉంటారు. గ్రామంలో ప్రతీ ఇంటి వారు తమ బంధువులను పిలిచి పెద్ద పండగ మాదిరిగా నవమి వేడుకలు చేసుకునే వారు. శ్రీరామనవమి రోజున పౌరాణిక నాటి కలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసే వారు.అంత ఘనంగా నిర్వహించే శ్రీరామనవమి వేడుకలపై ఈ ఏడాది సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం వేడుకలు జరుగుతాయో, లేదోనన్న భావన గ్రామస్తుల్లో నెలకొంది. ఈసందిగ్ధత, గందరగోళానికి కూటమి నేతల తీరే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆ కుటుంబీకులే కల్యాణం జరిపిస్తున్నారు...

గత 25 ఏళ్లుగా శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణాన్ని గ్రామానికి చెందిన లెంక నారాయణప్పడు కుటుంబీకులే జరిపిస్తూ వస్తున్నారు. ఇదే విధానం కొనసాగించే లా 2000 సంవత్సరంలోనే గ్రామపెద్దల సమక్షంలో అంతా కలిసి తీర్మానం కూడా చేసుకున్నారు. ఈతీర్మానాన్ని కాదని ఎల్లప్పడూ నారాయణప్పడు కుటుంబీకులే కల్యాణం జరిపిస్తారా..? ఈసారి మార్చాల్సిందేనని కూటమికి చెందిన కొంతమంది నేతలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి నారాయణప్పడు కుటుంబీకులే కల్యాణం జరిపిస్తున్నారని గ్రామస్తులతో పాటు తీర్మానం చేసేటప్పుడు ఉన్న పెద్దలు పోలీసులకు చెప్పినప్పటికీ కూటమి నేతలు ఒప్పుకోవడం లేదు.

ఇది సబబు కాదు



నా వయస్సు 80 ఏళ్లు. మాగ్రామంలో ఏటా అగ్ని ప్రమాదం సంభవిస్తూ ఇళ్లు కాలిపోతుండేవి. అప్పుడు లెంక నారాయణప్పడు కుటుంబీకులు గ్రామంలో రామాలయం కట్టించారు. అప్పటి నుంచి అగ్ని ప్రమాదాలు తగ్గాయి. గ్రామస్తులు అంతా అప్పటి నుంచి వారి కుటుంబీకులే శ్రీరాముని కల్యాణం జరిపిస్తున్నారు. ఇప్పుడు కుర్రాలు గతం తెలియక వారిని కాదంటున్నారు. ఇది సబబు కాదు.

– ఎం.కృష్ణ,
పెణసాం గ్రామస్తుడు

పోలీసులూ వారికే మద్దతు పలుకుతున్నారు



మా తాత, తండ్రి నుంచి మా కుటుంబీకులే సీతారాముని కల్యాణం జరిపిస్తున్నారు. ఈఏడాది కూటమి నేతలు మా కుటుంబీకులు కల్యాణం జరిపించడానికి వీల్లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో చేసుకున్న తీర్మానాలను చూపించినప్పటికీ పోలీసులు కూడా వారికే మద్దతు పలికే విధంగా మాట్లాడుతున్నారు.

– లెంక మోహన్ రావు, ఎంపీటీసీ సభ్యుడు, పెణసాం గ్రామం



సీతారాముల కల్యాణాన్ని లెంక నారాయణప్పడు కుటుంబీకులే జరిపించాలని గ్రామస్తులు చేసిన తీర్మాన పత్రం

సత్తాచాటిన బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు



విద్యార్థినులు, ఉపాధ్యాయిని అనురాధను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చీపురుపల్లి: అమెజాన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 1, 2 తేదీల్లో విశాఖపట్నంలో ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాక్‌థాన్ పేరుతో జోనల్ స్థాయి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి 80 మంది విద్యార్థులు 18 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమాజంలో ఎదుర్కొం టున్న ప్రధాన సమస్యలపై పరిష్కారం చూపుతూ కోడింగ్ ద్వారా యానిమేషన్ చేసి చూపించడంపై విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. జోనల్ స్థాయిలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో చీపురుపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం ద్వారా పశువులు మృతి చెందడం, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నివారించడం అనే అంశాలపై జీవశాస్త్ర ఉపాధ్యాయిని డి.అనురాధ ప్రోత్సాహంతో విద్యార్థినులు లిఖితా స్వరాజ్, మనస్విని, శశిబిందు కోడింగ్ ద్వారా యానిమేషన్ ప్రదర్శించారు. జోనల్ స్థాయిలో ఈ యానిమేషన్ ప్రథమ స్థానంలో నిలవడంతో విద్యార్థినులకు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.వర్క్‌షాప్‌నకు హాజరైన ముగ్గురు విద్యార్థినులతో పాటు వారికి మెంటర్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని అనురాధను ఆ పాఠశాల హెచ్‌ఎం రెహానా బేగమ్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్, చల్లపేట రూరల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యా హ్నం 2గంట ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఏ.అనంతరావు గురువారం ఓ ప్రకట నలో తెలిపారు. మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో గజపతినగరం,పురిటిపెంట, వెంకటాపురం, బంగారమ్మపేట,భూదేవిపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంఘాలన్నీ ఏ-గ్రేడ్‌లో ఉండాలి



గుర్ల: మాట్లాడుతున్న డీపీఎం రాజ్యలక్ష్మి



గజపతినగరం రూరల్: వీఓఏలకు సూచనలు చేస్తున్న డీపీఎం సీతారామయ్య



దత్తిరాజేరు: శిక్షణ ఇస్తున్న డీపీఎం ఇందిర

గుర్ల: డ్వాక్రా సంఘాలన్నీ ఏ-గ్రేడ్‌లో ఉండాలని వెలుగు డీపీఎం రాజ్యలక్ష్మి అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు వార్షిక రుణాలు అందించడం, ఆ నిధులతో జీవనోపాధి ప్రణాళికలు సిద్ధం చేసుకునే విధానాలపై వీఓఏలు, ఎన్యూమరేటర్లకు స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగించుకుని స్వయం ఉపాధి పొందేలా అవగాహ న కల్పించాలని సూచించారు. అలాగే రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. సంఘాల్లోని ప్రతీ సభ్యు రాలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఏపీఎంలు భారతి, వై.నాయుడు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

దత్తిరాజేరు: మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల సభ్యులు జీవనోపాధులు మెరుగుపరుచుకుని ఆర్థికా భివృద్ధి సాధించాలని వెలుగు డీపీఎం ఇందిర అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి జీవనో పాధుల ప్రణాళికల తయారీపై ఏపీఎం అప్పలనాయుడు అధ్యక్షతన స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఎన్యూమరేటర్లకు గురువారం శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకులు ద్వారా రుణా లు తీసుకోవడం, వాటితో చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించడంపై అవగాహన కల్పించాలని డీపీఎం సూచించారు.

గజపతినగరంలో..

గజపతినగరం రూరల్: స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధి ప్రణాళికలపై స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని వీఓఏలు, ఎన్యూమరేటర్లకు రెండోరోజు గురువారం శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని వీఓఏలు, ఎన్యూమరేటర్లకు వెలుగు డీపీఎం సీతారామయ్య సూచించారు. ఏపీఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి

బొండపల్లి: ఆరేళ్ల లోపు పిల్లల కోసం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. ఈనెల 5వ తేదీన వెదురువాడ సచివాలయంలో, 8,9వ తేదీల్లో రాచకిండాం సచివాలయంలో, అంబటివలస సచివాలయంలో 10,11వ తేదీల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పిల్లలకు కొత్తగా ఆధార్ కార్డుతో పాటు కార్డులో మార్పులు ,చేర్పులు చేసుకోవాల్సిన వారు శిబిరాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆక్రమిత స్థలం పరిశీలన



ఆక్రమిత స్థలంపై వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్, ఆర్‌ఐ, తదితరులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ పాతవూరులో స్థలం ఆక్రమణపై గొల్లు ఈశ్వరమ్మ గ్రీవెన్స్‌సెల్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రాములమ్మ గురువారం స్థలాన్ని పరిశీలించారు. 1997 జూలై 12న ప్రభుత్వం గొల్లు ఈశ్వరమ్మకు రెండు సెంట్ల స్థలం మంజూరు చేసింది. ఆ స్థలంలో ఆమె కమ్మలపాక వేసుకుంది. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించి, పునాదులు తీశారని బాధితురాలు ఇటీవల గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తహసీల్దార్ రాములమ్మ, ఆర్ఐ రామలక్ష్మి స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

టీఏల బాధ్యతల స్వీకరణ

దత్తిరాజేరు: మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి బదిలీపై వచ్చిన టీఏలు(టెక్నికల్ అసిస్టెంట్లు) చప్ప రమణ,సునీత స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ నుంచి బొండపల్లి,గజపతినగరం మండలాలకు నలుగురు టీఏలు బదిలీపై వెళ్లగా... గజపతినగరం, బొండపల్లి మండలాల నుంచి ఇద్దరు ఇక్కడికి వచ్చారు. మరో ఇద్దరు టీఏలు రావాల్సి ఉందని ఏపీఎం అప్పలనాయుడు తెలిపారు.

రామతీర్థంలో కొనసాగుతున్న వసంతోత్సవాలు



ప్రత్యేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ వసంతోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామి సన్నిధిలో అర్చకులు గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 40 మంది వేద పండితుల సమక్షంలో పారాయణాలు చేపట్టారు. అలాగే లక్ష తులసీ దళార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



గ్రామ సచివాలయ మహిళా పోలీసులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి సూచించారు. వేపాడ మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో వల్లంపూడి పోలీస్ స్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐ దేవి వివిధ చట్టాలపై అవగాహన కల్పించా రు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, ఎక్కడ ఎలాంటి అసాంఘిక కార్య క్రమాలు జరిగినా, సారా తయారు చేసినా, విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా తక్షణం పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టం, లోన్, బెట్టింగ్ యాప్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించా రు.

– వేపాడ

ఉల్లాసంగా ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శన



మైచర్ల శింగవరంలో గ్రామదేవత వేమాలమ్మ తీర్థం సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బళ్ల పరుగు ప్రదర్శ న పోటీలు ఆకట్టుకున్నాయి. విజయనగరం,అనకాపల్లి జిల్లాలకు చెందిన 18 ఎడ్ల బళ్లు పోటీల్లో పాల్గొనగా వేపాడకు చెందిన వంటాకు సూర్యనారాయణ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో బోనంగికి చెందిన మోదమాంబ ఎడ్లు, తృతీ య స్థానంలో ఎం.శింగవరం గ్రామానికి చెందిన వేమాలమ్మ ఎడ్లు నిలిచాయి. విజేతలకు గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.

– వేపాడ

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పండి



శృంగవరపుకోట: తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఈఆర్‌ఓ మురళి



గజపతినగరం రూరల్: మాట్లాడుతున్న ఈఆర్‌ఓ ప్రమీలా గాంధీ

శృంగవరపుకోట: ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే తెలియజేసి అధికారులకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఈ.మురళి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల వివరాలను డోర్ నెంబర్ల వారీగా ఎన్యూమరేటర్లు పరిశీలించి, పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇక్కడే నివాసం ఉంటున్న వాళ్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలను నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించామని చెప్పారు. కొత్తగా ఓటర్ల నమోదు, తొలగింపులు, చనిపోయిన వాళ్లు, వలసలు వెళ్లిన వారి వివరాలను రెవెన్యూ సిబ్బందికి ఇచ్చి, జాబితాలు పరిశీలించి అభ్యంతరాలు ఉంటే చెప్పాలని కోరారు. తహసీల్దార్ అరుణకుమారి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

శాశ్వత వలస ఓటర్ల వివరాలు అందించండి

గజపతినగరం రూరల్: గ్రామాల నుంచి శాశ్వతంగా వలస వెళ్లి పోయిన ఓటర్ల వివరాలను బీఎల్‌ఓలకు అందించాలని ఈఆర్‌ఓ ప్రమీలాగాంధీ రాజకీయపార్టీల నాయకులను కోరారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయపార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే వారి అభీష్టం మేరకు ఒక చోటే ఓటు ఉంచి వేరొక చోట తొలగిస్తామని చెప్పారు. జిన్నాం గ్రామంలో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నాయకులు ఈఆర్‌ఓను కోరారు. అలాగే పురిటిపెంట, గజపతినగరం గ్రామాల్లో ఓటర్లు కలిసిపోయారని, ఏగ్రామానికి చెందిన ఓటర్లను ఆ గ్రామంలో చేర్చాలని అభ్యర్థించారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు శీర రమణ, టీడీపీ నాయకుడు అట్టాడ లక్ష్మునాయుడు, బీజేపీ నాయకులు మండపాక భారతి, ఏడుకొండలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులకు వ్యక్తిగత భద్రత, ఆత్మరక్షణపై ఎస్ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు, ఎవరైనా దాడిచేసినప్పుడు ఎవరో వస్తారు రక్షిస్తారని ఎదురు చూడకుండా దాడి నుంచి తప్పించుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ఆకతాయిలు దాడి చేసే సమయంలో బాలికలు తమని తాము రక్షించుకునే విధానంపై జామి మండలంలోని అలమండ గ్రామ సమీపంలోని రామ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పని చేస్తేన్న కరాటే బ్లాక్‌బెల్ట్ నిపుణుడు రామరాజు కరాటే విద్యద్వారా వివరించారు. అలాగే గుడ్ టచ్,బ్యాడ్ టచ్‌పై ఎస్ఐ వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా వెంటనే తల్లిదండ్రులు, లేదా పెద్దలు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.కేజీబీవీ ఎస్ఓ ప్రవీణ, కానిస్టేబుళ్లు గౌరినాయుడు,నాగమణి, పాల్గొన్నారు.

5న 'గురువందనం'



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు రాజ్యలక్ష్మి, నీలాద్రిరావు, త్రినాథరావు, తదితరులు

విజయనగరం టౌన్: వాయులీన విద్యాప్రవీణ, సంగీత విద్యానిధి సద్గురు ద్వారం దుర్గాప్రసాదరావుకు గురువందన కార్యక్రమాన్ని ఈ నెల 5న స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శిష్యప్రశిష్య సమాఖ్య వైస్ చైర్మన్‌లు సీహెచ్.రాజ్యలక్ష్మి, పి.త్రినాతరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక గురజాడ స్వగృహంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ద్వారం దుర్గాప్రసాదరావును ఘనంగా సత్కరించనున్నట్లు చెప్పారు. అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, మండా సుధారాణి, కట్టమూరి చంద్రశేఖరం, కవిరాయని ఏవీఎల్‌ఎన్.శాస్త్రి, చాగంటి కొండలరావు హాజరవుతారని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ఎం.నీలాద్రిరావు, కోశాధికారి ఎమ్.ధనలక్ష్మి, సభ్యులు కె.విజయలక్ష్మి, ఎంవీ కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.